ఉప ఎన్నికలు రావు.. ఇది రేవంత్ తీర్పు!

మొదటిపేజీ తరువాయి...

సుప్రీంకోర్టులో ఉంది. ఆ సుప్రీంకోర్టులో సబ్‌జుడిస్ అయిన విషయంలో లోపల (సభలో) నేను మాట్లాడితే ప్రొటెక్షన్ ఉంటుంది. బయట మాట్లాడే వారికి ప్రొటెక్షన్ ఉండదు. ఈ సభ కొన్ని చట్టాలకు అతీతం. ఈ సభలో కొన్ని విషయాలు ప్రస్తావించవచ్చు. సభకు రక్షణ ఉంది. కానీ సభ బయట ఉప ఎన్నికలు వస్తయి, అయిపోయింది వచ్చే వారమే ఎన్నికలు మళ్ల వారమే ఎన్నికలు అనడం ఇదంతా ఉత్తదే' అని వ్యాఖ్యానించారు. దీనిపై న్యాయ నిపుణులు, రాజ్యాంగ విశ్లేషకులు మండిపడుతున్నారు. 'ఏదైనా ఒక అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు.. దానిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదన్నది నిబంధన. కానీ సీఎం ఆ నిబంధనను స్వేచ్ఛగా అధిగమించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల కేసులో తీర్పు చెప్పేశారు' అని న్యాయ నిపుణుల విమర్శిస్తున్నారు. 'అసెంబ్లీ అనేది పవిత్రమైన రాజ్యాంగ వ్యవస్థ. అలాంటి వేదిక సాక్షిగా పార్టీ ఫిరాయింపుదారులకు భరోసా ఇస్తూ.. సీఎం చట్టసభల ఔన్నత్యాన్ని మంటగలిపారు' అని రాజ్యాంగ నిపుణుల అభిప్రాయపడ్డారు. 'ఇది అసెంబ్లీ, పార్లమెంటు నిబంధనలను తుంగలో తొక్కడమే కాదు.. చట్టసభలకే వక్ర భాష్యం చెబుతూ, 'నేనే రాజు– నేనే జడ్జి' అనే తరహాలో వ్యవహరించారు' అని విశ్లేషకులు ఆక్షేపించారు. కోర్టు పరిధిలోని అంశంపై వ్యాఖ్యలు చేయరాదని తెలిసినా మాట్లాడటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని అవమానించారని విమర్శిస్తున్నారు. స్పీకర్‌ను, అసెంబ్లీని అడ్డుపెట్టుకొని కోర్టు ధిక్కార వ్యాఖ్యలు చేయడంతో సీఎం రాజ్యాంగ వ్యవస్థలను ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తున్నట్టు కనిపిస్తున్నదని, కోర్టు తీర్పులను ప్రభావితం చేయొచ్చన్న ఆలోచన ఆందోళనకరమని పేర్కొన్నారు.

ఫిరాయింపులను ప్రోత్సహించడమే..

ప్రజలు సంపూర్ణ మెజార్టీతో అధికారం ఇచ్చినా సరిపోక కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు పార్టీ మారిన మొదటి రోజు నుంచి వారిపై చర్యలు తీసుకునేలా బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై అనర్హత వేటు పడేలా ఇటు అసెంబ్లీలో, అటు న్యాయస్థానాల్లో కొట్లాడుతున్నది. స్పీకర్ సహకరించకపోయినా.. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా న్యాయస్థానాల ద్వారా ఒత్తిడి తెస్తున్నది. మరోవైపు సుప్రీంకోర్టు సైతం పార్టీ ఫిరాయింపులపై ఆగ్రహంగా కనిపిస్తున్నది. ఏకంగా స్పీకర్‌కే నోటీసులు జారీచేసింది. ఈ నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు భయం మొదలైంది. తమపై అనర్హత వేటు తప్పదనే సంకేతాలు వారికి కనిపించాయి. అందుకే 'ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికైనా సిద్ధం' అని కడియం శ్రీహరితో పాటు పలువురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు తరచూ వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి భారీగా వలసలు వస్తాయని ఆశించిన కాంగ్రెస్‌కు భంగపాటు ఎదురైంది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల పరిస్థితిని చూసిన తర్వాత.. పార్టీ ఫిరాయించేందుకు ఎవరూ సాహసించడం లేదు. దీంతో కాంగ్రెస్‌లో అంతర్మథనం మొదలైంది. ఈ నేపథ్యంలోనే.. తనను నమ్మి కాంగ్రెస్‌లోకి చేరిన పదిమంది ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి 'ఉపఎన్నికలు రావు' అంటూ అసెంబ్లీలో వ్యాఖ్యానించారని చెప్తున్నారు. ఇది కోర్టు ధిక్కరణతో పాటు.. ఫిరాయింపులను ప్రోత్సహించడమే అని రాజ్యాంగ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇది మీకు ఎలాంటి ప్రమాదం లేదంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు భరోసా ఇవ్వడమేనని, కొత్తగా ఎవరైనా పార్టీ ఫిరాయించినా చర్యలు ఉండవు అంటూ ప్రోత్సహించేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా పదవిని అవమానించడమే అవుతుందని అంటున్నారు. 'గతంలో మహారాష్ట్ర, మణిపూర్ రాష్ట్రాలకు సంబంధించిన ఫిరాయింపుల కేసు తన ముందుకు వచ్చినప్పుడు సుప్రీంకోర్టు విచారణ తీవ్రత వల్ల పార్టీ మారిన

ఎమ్మెల్యేలు రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆయా చోట్ల ఉప ఎన్నికలు కూడా జరిగాయి. అలాంటి సందర్భంలో సుప్రీంకోర్టు ఇంకా ఏమీ తేల్చకముందే ఉప ఎన్నికలు రానే రావన్న ముఖ్యమంత్రి మాట అభ్యంతరకరమైనది. ఎందుకంటే రాష్ట్ర అసెంబ్లీకి ఇంకా మూడున్నరేండ్ల సమయం ఉంది. సుప్రీంకోర్టు తీసుకొనే వైఖరిని బట్టి ఏదైనా జరగడానికి అవకాశం ఉంది. ఎందుకంటే సముచిత సమయంలో నిర్ణయం అంటే శాసనసభ పదవీ కాలం ముగిసేదాకా కాలం గడపడమేనా? అని సుప్రీంకోర్టు ఇటీవలనే వ్యాఖ్యానించింది' అని ఒక న్యాయ నిపుణుడు గుర్తుచేశారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలపై చట్టసభల్లో మాట్లాడకూడదని పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉన్నదని గుర్తుచేశారు. అడిగే వారు ఎవరూ లేరనే తరహాలో సీఎం వ్యాఖ్యలున్నాయని మండిపడుతున్నారు.

హరీశ్‌రావు పాయింట్ ఆఫ్ ఆర్డర్

హైకోర్టు, సుప్రీంకోర్టు పరిధిలోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఆయన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తారు. 'ముఖ్యమంత్రి ఈ సభకు ఇమ్యూనిటీ ఉంది, సభలో కోర్టుల గురించి కూడా మేం ఏదైనా మాట్లాడవచ్చు' అని అన్నారని.. అంటూ ఈ సందర్భంగా పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లోని 1021 పేజీ నంబర్‌లోని అంశాన్ని చదివి వినిపించారు. 'న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ అంశం గురించి అయినా సభ్యులు సభలో చర్చించకూడదు' అని స్పష్టంగా పొందుపరిచారని తెలిపారు. చాప్టర్ 18లో 'పార్లమెంట్, న్యాయవ్యవస్థ రెండూ రాజ్యాంగ పరిధిలోనివే. ఒకరి అధికార పరిధిని మరొకరు అతిక్రమించకూడదు. ఆర్టికల్ 121 ప్రకారం, ఒక జడ్జిని తొలగించాలని కోరుతూ రాష్ట్రపతికి సమర్పించే తీర్మానంపై తప్ప.. ఒక న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు ప్రవర్తనను పార్లమెంటులో చర్చించరాదు' అని పేర్కొన్నట్టు తెలిపారు. సీఎం ఎలా రూల్స్ అతిక్రమించారో వివరించారు. రేవంత్‌రెడ్డి సర్వోన్నత న్యాయస్థానంలో పెండింగులో ఉన్న అంశాలను ఈ సభలో మాట్లాడరనే విషయాన్ని నేను మీ దృష్టికి తీసుకొస్తున్నాను' అంటూ స్పీకర్‌కు హరీశ్‌రావు వివరణ ఇచ్చారు.

నిండు సభలో చట్టవిరుద్ధంగా వ్యాఖ్యలు

సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న పార్టీ ఫిరాయింపుల విషయమై నిబంధనలకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారని హరీశ్‌రావు మీడియాతో చిట్‌చాట్‌లో వివరించారు. ముఖ్యమంత్రి సభలో మాట్లాడింది పూర్తిగా పార్లమెంటరీ వ్యవస్థకు విరుద్ధంగా ఉన్నదని అన్నారు. కోర్టులో పెండింగులో ఉన్న విషయాలను చట్టసభల్లో మాట్లాడకూడదు అని కౌల్ అండ్ షక్దర్ పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉన్నదని తెలిపారు. కోర్టు పరిధిని అధిగమించి ముఖ్యమంత్రి మాట్లాడారని అన్నారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నా కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ విషయంపై జడ్జిమెంట్ ఇచ్చాడని చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు డిస్‌క్వాలిఫై కారు, ఉపఎన్నికలు రానేరావు అని జడ్జిమెంట్ ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. సీఎం తన పరిధిని దాటి సుప్రీంకోర్టులో ఉన్న విషయంపై మాట్లాడడం అసెంబ్లీ ప్రివిలేజ్ కిందకే వస్తుందని చెప్పారు. తాను పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద చెప్పే ప్రయత్నం చేస్తే మధ్యలో మైక్ కట్ చేశారని చెప్పారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశామన్నారు. సభలో ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, తక్కువ సభ్యులు ఉన్నవారికి మైక్ ఇస్తూ.. తమకు ఇవ్వడం లేదన్నారు.

బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

శాసనసభలో మైక్ ఇవ్వకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు బుధవారం సభ నుంచి వాకౌట్ చేశారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు అనర్హులు కాబోరని, రాష్ట్రంలో ఎలాంటి ఉపఎన్నికలు రాబోవని సీఎం రేవంత్‌రెడ్డి సభలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అభ్యంతరం తెలిపారు.

గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై సుప్రీం తీర్పును తప్పబట్టిన రేవంత్

అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహంతో తప్పయిందని ఒప్పుకోలు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): గతంలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చినప్పుడు కూడా సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. విలేకరులతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడుతూ "బీఆర్ఎస్–బీజేపీ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చింది. కవిత బెయిల్ కోసం బీఆర్ఎస్ ఎంపీ సీట్లు త్యాగం చేసింది. అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాకు రాని బెయిల్ ఐదు నెలల్లోనే కవితకు ఎలా వచ్చింది" అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రఆగ్రహం వ్యక్తంచేసింది. "రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి ఇదేనా మీరు మాట్లాడేది? ఒక సీఎం చేయాల్సిన ప్రకటనేనా ఇది. మీ పద్ధతేం బాగోలేదు. ఆ వ్యాఖ్యలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తాయి. పార్టీలను సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటామా? అత్యున్నత న్యాయస్థానంపై గౌరవం లేదా?" అని మండిపడింది. వివరాల్లోకి వెళ్తే.. ఓటుకు నోటు కేసు విచారణను వేరే రాష్ట్రానికి తరలించాలంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఆగస్టు 29న విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం మండిపడింది. సీఎం రేవంత్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "ఆయన (సీఎం రేవంత్‌రెడ్డి) నిన్న ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఈ రోజు పొద్దున పత్రికల్లో చదివాం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి అలాంటి వ్యాఖ్యలు చేయవచ్చా? ప్రభుత్వం, న్యాయస్థానం మధ్య పరస్పర గౌరవం ఉండాలన్న ప్రాథమిక నియమం కూడా తెలియదా? వ్యవస్థల మీద భిన్నాభిప్రాయాలున్నా గౌరవం ఉండాలి కదా! ఇలాంటి ప్రవర్తన, ఇంత మొండి వైఖరి ఉంటే ఎలా? కార్యనిర్వాహక, శాసనవ్యవస్థలో మేము(కోర్టులు) జోక్యం చేసుకోబోమని ఎప్పుడూ చెప్తుంటాం. అంతే గౌరవాన్ని మేము వారి నుంచి కూడా ఆశిస్తాం. సుప్రీంకోర్టు ఆదేశాలపై ధైర్యంగా వ్యాఖ్యలు చేయవచ్చని అనుకుంటున్నారా? నిన్ననే ఓ అదనపు కార్యదర్శికి నోటీసులు ఇచ్చాం. ఈ ఒక్క కారణంతో పిటిషనర్ కోరినట్టు మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వొచ్చు. దేశంలోని అత్యున్నత న్యాయస్థానంపై ఆయనకు(రేవంత్‌రెడ్డికి) నమ్మకం లేకపోతే వేరే రాష్ట్రంలో కేసు విచారణను ఎదుర్కోమనండి" అని ధర్మాసనం స్పష్టంచేసింది. దీంతో స్పందించిన రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాదులు ఈ వ్యాఖ్యలు అవాంఛనీయమని, ఆయన తరపున సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు.

కోర్టు పరిధిలో అంశంపై అడ్డగోలు వ్యాఖ్యలా?

సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్స్‌పై కేటీఆర్ సీరియస్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి అనే విషయాన్ని మర్చిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపులపై చేసిన వ్యాఖ్యల మీద 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. కొన్ని సందర్భాల్లో రేవంత్‌రెడ్డి అనేక పాత్రల్లో జీవిస్తుంటారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ రోజు తానే సుప్రీంకోర్టు అని నిర్ణయించుకున్నారని విమర్శించారు. అందుకే ఎమ్మెల్యేల ఫిరాయింపులపై తీర్పు చెప్పాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. 'సభా నియమాల ప్రకారం న్యాయపరమైన విషయంపై ఎవరూ వ్యాఖ్యలు చేయకూడదు. కానీ సీఎం రేవంత్ రెడ్డి అన్ని నియమాలను తుంగలో తొక్కి గౌరవ సుప్రీంకోర్టు కన్నా తానే గొప్ప అనే భావనలో ఉన్నాడు' అని దుయ్యబట్టారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తుందని చెప్పారు. 'మిమ్మల్ని ఎన్నుకున్నది ముఖ్యమంత్రిగా పనిచేస్తారని, కానీ, పరకాయప్రవేశాలు, పగటి వేషాలు, పిట్టలదొర మాటలతో కాలం వెళ్లబుచ్చాలని చూస్తున్నారు.

రాష్ట్రంలో పవర్ పర్చేజ్ షాపింగ్!

కరెంటు కొనుగోలులో లాభాలున్నాయేమో!

- 30% మిగులు విద్యుత్తు కొనుగోలు అయినా, అప్రకటిత కోతలా?
- సెటిల్‌మెంట్లకు అడ్డాగా ఠాణాలు
- పిల్లలు బండ్లు నడిపితే అడ్డుకోరా?
- ఫొటోలు తీయడమే పోలీసుల పనా?
- ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఫైర్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు కొనుగోలు వ్యాపారం అడ్డగోలుగా సాగుతున్నదని ఎంఐఎం పార్టీ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శించారు. అధిక రేట్లకు అవసరానికి మించి విద్యుత్తు కొనుగోలు చేసినప్పటికీ ఎందుకు అప్రకటిత విద్యుత్తు కోతలు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో 30 శాతం మిగులు విద్యుత్తు ఉన్నప్పటికీ ఎందుకు కోతలు విధిస్తున్నారని నిలదీశారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో కరెంట్ కోతలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యకంచేశారు. గచ్చిబౌలి, హైటెక్ సిటీ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్తు కోతలు ఉంటున్నాయని, ఆయా కంపెనీలు కరెంట్ లేదని.. ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరానికి మించి విద్యుత్తు కొనుగోలు చేస్తున్నది నిజమా? కాదా? అని ప్రశ్నించారు. 'పవర్ పర్చేజ్ షాపింగ్ చల్ రాయ్..' అని ఎద్దేవా చేశారు. 2025–26లో 95 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరమని విద్యుత్తు రంగ నిపుణులు అంచనా వేయగా, 1.23 లక్షల మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఎందుకు కొనుగోలు చేశారని ప్రశ్నించారు. అంటే 30 శాతం అధికంగా విద్యుత్తు కొనుగోలు చేసినా కోతలు ఎందుకు ఉంటున్నాయని నిలదీశారు. కరెంటు కొనుగోళ్లలో బాగా లాభాలు ఉన్నట్టున్నాయని, అందుకే వేర్వేరు రేట్లకు విద్యుత్తు కొంటున్నారని విమర్శించారు.

ఆలోచించే మ్యానిఫెస్టో పెట్టారా?

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో తయారుచేసిన వారు ఆలోచించారా? లేదా? అని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ముందు అధికారంలోకి రానివ్వు.. అమలు సంగతి తర్వాత ఆలోచిద్దామనుకున్నారా? అని నిలదీశారు. పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన 420 హామీలను ఎలా అమలు చేయాలా? అని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తున్నదని ధ్వజమెత్తారు. అసెంబ్లీ బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లు భూముల సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారాయని ఆరోపించారు. పోలీసులు శాంతిభద్రతలను పట్టించుకోకపోవడంతో క్రైమ్ రేటు గణనీయంగా పెరిగిందని విమర్శించారు. మహిళలపై లైంగికదాడులు, కిడ్నాప్‌లు, దోపిడీలు, దొంగతనాలను అడ్డుకోకపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారని తెలిపారు. మైనర్లు (చిన్న పిల్లలు) ద్విచక్రవాహనాలు నడుపుతున్నారని, పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని, వారికి కౌన్సెలింగ్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అనేక ప్రమాదాలకు మైనర్లే కారకులని పేర్కొన్నారు. పోలీసులు ఫొటోలు తీయడానికే ఉన్నారా? అని మండిపడ్డారు.

ఫైరింజన్ ఫిల్లింగ్ పాయింట్ ఎక్కడ?

రాష్ట్రవ్యాప్తంగా ఏటా పెద్దసంఖ్యలో అగ్నిప్రమాదాలు జరిగి వందల మంది మరణిస్తున్నా, కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అక్బరుద్దీన్ ఆందోళన వ్యక్తంచేశారు. అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఆరు అంతస్తులకు అనుమతి తీసుకొని 14 ఫ్లోర్‌లు కడుతున్నా అగ్నిమాపక అధికారులు పరిశీలించరా? అని ప్రశ్నించారు. నిబంధనలు పాటించినవారికి ఎన్‌వోసీ ఇవ్వకుండా, అతిక్రమించేవారి వద్ద డబ్బు తీసుకొని ఎన్‌వోసీ ఇస్తారని తీవ్ర ఆరోపణలు చేశారు. అగ్నిప్రమాదం జరిగితే రీఫిల్లింగ్ పాయింట్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. హైటెక్ సిటీలో ఫైరింజన్ ఫిల్లింగ్ పాయింట్లు ఎన్ని ఉన్నాయి? నీళ్లు అయిపోతే రీఫిల్లింగ్ కోసం ఎక్కడికి వెళ్లాలి? అని నిలదీశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం పనితీరు ఘోరంగా ఉన్నదని ఆరోపించారు.

పడిపోయిన రియల్ ఎస్టేట్

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయిందని, రియల్టర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని అక్బరుద్దీన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎవ్వరి దగ్గర పైసలు లేవని, ప్రజలు భూములు కొనడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రియల్ ఎస్టేట్ రంగాన్ని గాడినపెట్టాలని సూచించారు. భూభారతి అని పేరు మార్చారు తప్ప సమస్యలు అలాగే ఉన్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో 12 లక్షల ఇండ్లు ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో అన్ని ఇండ్లు ఎలా సాధ్యమని తాను ప్రశ్నిస్తే, తనపై కాంగ్రెస్ నేతలు అంతెత్తున ఎగిరారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో ఎన్ని ఇండ్లు నిర్మించారని నిలదీశారు.

కమీషన్ల వివాదం.. సభలో వాగ్యుద్ధం

- సచివాలయంలో కాంట్రాక్టర్లు ధర్నాలు చేస్తలేరా?.. మీ ఎమ్మెల్యేలే ఆరోపించారు
- వాటికి ప్రభుత్వం జవాబు చెప్పాలి.. అసెంబ్లీ సాక్షిగా విరుచుకుపడిన కేటీఆర్
- ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బెదిరింపులు
- భట్టి వ్యాఖ్యలనూ తొలగించాలన్న బీఆర్ఎస్..
- నిరసనగా బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్.. అసెంబ్లీ గేటుముందు ధర్నా

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): 30% కమీషన్ వసూళ్లపై అసెంబ్లీ బుధవారం అట్టుడికింది. తమ వద్ద 20% కమీషన్లు వసూలు చేస్తున్నారంటూ సాక్షాత్తు సచివాలయంలోనే కాంట్రాక్టర్లు ధర్నాలు చేస్తున్నారని, ఏ పని కావాలన్నా 30% చెల్లించుకోవాల్సి వస్తున్నదంటూ అధికార పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారని ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు విరుచుకుపడ్డారు. బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరపున జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పల్లా మాట్లాడుతున్నంత సేపు అధికార పార్టీ సభ్యులు ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. రన్నింగ్ కామెంట్రీ చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ జోక్యం చేసుకున్నారు. 'రెచ్చగొట్టేలా మాట్లాడాలంటే మేమూ ఎంతైనా మాట్లాడతాం. సభ్యులు మాట్లాడుతుంటే మంత్రులకు, ప్రభుత్వానికి ఓపిక, సహనం ఉండాలి. ఇన్నిసార్లు అంతరాయం కలిగిస్తారా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. స్పీకర్ రికార్డులను పరిశీలించాలని, మంత్రులు ఎంతసేపు మాట్లాడారో చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షంగా తాము అడుగుతామని, ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. డిస్కషన్, డిబేట్ జరగడం ప్రజాస్వామ్య గొప్పదనమని చెప్పారు. తాము కొత్తగా ఏమీ అనలేదని, 30% కమీషన్ అని మీ అధికార పార్టీ ఎమ్మెల్యేనే అంటున్నారని, 20% కమీషన్ అంటూ కాంట్రాక్టర్లు సచివాలయంలోనే ధర్నాలు చేస్తున్నారని, ప్రభుత్వం దీనిపై సమాధానం చెప్పాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఊహించనివిధంగా కమీషన్ల దందా గురించి కేటీఆర్ మాట్లాడటంతో, అధికార పక్షానికి ఏం మాట్లాడాలో తోచలేదు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కేటీఆర్ మాటలతో తీవ్ర అసహనానికి గురయ్యారు. మైక్ తీసుకొని ఆవేశంతో ఊగిపోయారు. మరోవైపు, ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న కేటీఆర్ వద్ద ఉన్న మైక్ కట్ అయ్యింది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మైక్ తీసుకొని, కేటీఆర్‌కు సమాధానం చెప్పే క్రమంలో ఏదిపడితే అది తమ గురించి మాట్లాడవద్దని, ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని తీవ్ర పదజాలంతో, పరుషంగా వ్యాఖ్యానించారు. ఆవేశంగా ఉన్న డిప్యూటీ సీఎం ఒకింత అసహనంతో 'ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు' అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి బెదిరింపులకు దిగారు.

> మేము కొత్తగా ఏమీ అనలేదు. 30% కమీషన్ అని మీ అధికార పార్టీ ఎమ్మెల్యేనే అంటున్నారు. 20% కమీషన్ అంటూ కాంట్రాక్టర్లు సచివాలయంలోనే ధర్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై సమాధానం చెప్పాలి. -కేటీఆర్

డిప్యూటీ సీఎం బెదిరింపులపై బీఆర్ఎస్ సభ్యుల ఆగ్రహం

నిండు సభలో డిప్యూటీ సీఎం బెదిరింపు ధోరణిలో మాట్లాడటంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భగ్గుమన్నారు. భట్టి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, భట్టి మాటలను రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు, అధికారపక్షం కూడా కేటీఆర్ మాటలను రికార్డుల నుంచి తొలగించాలని, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. దీంతో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. దీంతో భట్టి వ్యాఖ్యలను కూడా రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. కేటీఆర్‌ను, బీఆర్ఎస్‌ను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడినందున, తమకు కూడా అవకాశం ఇస్తే తమ వాదన కూడా చెప్తామని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌ను కోరారు. ప్యానల్ స్పీకర్ ప్రకాశ్‌రెడ్డి బీఆర్ఎస్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా బీజేపీకి ఇచ్చారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌కు తన నిరసన తెలిపారు. అనంతరం భట్టి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీఆరఎస్ సభ్యులు పెద్ద ఎత్తున నినదిస్తూ, తమకు మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు, భట్టి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలతో మళ్లీ భగ్గు

కొద్దిసేపటి తర్వాత బీఆర్ఎస్ సభ్యులు మళ్లీ స